క్లుప్తంగా

ఉచిత కంటి శస్త్ర చికిత్సలు


శస్త్ర చికిత్స చేసుకున్న వారితో ఎమ్మెల్యే

జగిత్యాలటౌన్: జగిత్యాల పట్టణంలోని పావని కంటి ఆస్పత్రిలో ఆపీ రోటరీ క్లబ్ జగిత్యాల సహకారంతో ఆదివారం జగిత్యాల నియోజకవర్గానికి చెందిన 19 మంది నిరుపేదలకు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. అనంతరం ఉచిత కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పావని కంటి ఆస్పత్రి వైద్యులు డా విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అనంత పద్మనాభ స్వామి ఆలయ వార్షికోత్సవం


పూజలు చేస్తున్న భక్తులు

కోరుట్లరూరల్: మండలంలోని అయిలాపూర్ శివారులో అనంత పద్మనాభ స్వామి ఆలయ 22వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ


చెక్కు అందిస్తున్న దావ వసంత

రాయికల్: మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన పులి శేఖర్‌కు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.21 వేల చెక్కును జెడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత ఆదివారం అందజేశారు. మండలంలోని భూపతిపూర్ గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మాజీ మంత్రి జీవన్ రెడ్డి చొరవతో చెక్కులు మంజూరు కాగా, చెక్కులను గ్రామ కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్ గౌడ్, జక్కుల సాగర్,రాజేందర్, హరీశ్, విష్ణు, తదితరులు పాల్గొన్నారు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


పిల్లలను పరీక్షిస్తున్న వైద్యుడు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో సిరి పిల్లల ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వైద్యుడు చైతన్య ఆదివారం పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 107 మంది పిల్లలను పరీక్షించారు. పలువురికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో జగన్, శ్రీనివాస్, లక్ష్మణ్, గంగాధర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

కోరుట్ల రూరల్: మండలంలోని చిన్నమెట్‌పల్లిలో ఏఎస్సై సత్తయ్య ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాల రిజిస్ట్రేషన్ పేపర్లు, హెల్మెట్, పరిశీలించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేశారు. తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని వాహనదారులకు వివరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, పోలీసులు పాల్గొన్నారు.

రైతులూ.. అప్రమత్తంగా ఉండాలి

- మార్కెట్లో నకిలీ విత్తనాల బెడద
- ఎరువులు, విత్తనాలపై అవగాహన అవసరం
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన


ముత్యంపేటలో ఎరువులను పరిశీలిస్తున్న తహసీల్దార్ వీర్‌సింగ్, ఏవో లావణ్య, ఏఎస్సై లక్ష్మయ్య(ఫైల్)

మల్లాపూర్: జిల్లా వ్యాప్తంగా రైతులు వానాకాలం పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. దుక్కులు దున్ని పొలాలు సిద్ధం చేసుకుంటున్నారు. విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేస్తున్నారు. అయితే మార్కెట్‌లో నకిలీ విత్తనాల బెడద ఎక్కువగా ఉన్నందునా.. రైతులు అప్రమత్తంగా లేకపోతే మోసపోయే ప్రమాదం ఉంది. అధిక లాభాల కోసం విత్తనాలు, ఎరువుల దుకాణాల యజమానులు నకిలీవి అంటగట్టే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో విత్తనాలు, ఎరువులపై అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి లావణ్య సూచిస్తున్నారు. కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

విత్తన కొనుగోళ్లలో పాటించాల్సిన జాగ్రత్తలు

- వ్యవసాయశాఖ లైసెన్స్ పొందిన అధీకత డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. బిల్లుపై విక్రయదారుడి పేరు, కేంద్ర, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబర్, రైతు పేరు, గ్రామం పేరు, విక్రయదారుడి సంతకం, తేదీలు, రకం పేరు, బ్యాచ్ నంబర్, గడువు తేదీలు, నికర తూకం, కంపెనీ పేరు ఉన్నాయో లేదో సరిచూసుకోవాలి.
- లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనొద్దు.
- కొనుగోలు చేసే విత్తన ప్యాకెట్, సీసా, సంచి, డబ్బాలపై సీలు ఉందో లేదో నిర్ధారించుకోవాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను పంటకాలం పూర్తయ్యేంత వరకు దాచి పెట్టుకోవాలి.
- విత్తనాలు కొనుగోలు చేసి ఇంటికి తెచ్చిన తర్వాత మొలక శాతాన్ని చూసుకోవాలి. మొలక శాతం సంతృప్తికరంగా ఉంటేనే విత్తనాలుగా వాడుకోవాలి.
- మొలకెత్తే దశ, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారిని సంప్రదించాలి.

ఎరువులు కొనేముందు..

- డీలర్ల నుంచే ఎరువులు కొనుగోలు చేయాలి.
- మిషన్ కుట్టుతో ఉన్న ఎరువుల సంచులనే కొనాలి. ఒకవేళ చేతికుట్టు ఉంటే సీసం సీల్ ఉందో లేదో చూసుకోవాలి.
- ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి చేసిన సంస్థ, ఉత్పత్తిదారుడి పేరు ఉంటేనే కొనాలి.
- చిల్లులు పడిన, చిరిగిన ఎరువుల బస్తాలను కొనవద్దు. అన్యపదార్థాలు కలిస్తే ఆ ఎరువు కల్తీదిగా గుర్తించాలి.
- కొనుగోలు సమయంలో డీలర్ రికార్డులో రైతు విధిగా సంతకం చేయాలి. ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయశాఖ అధికారి సహకారంతో ఎరువులను పరీక్షలకు పంపించాలి.

పురుగు మందుల విషయంలో..

- వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకే పురుగుల మందులనే కొనుగోలు చేయాలి.
- పురుగు మందు డబ్బాలపై డైమండ్ ఆకారంలో పురుగుమందు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైతే ఎరుపు రంగు, విషపూరితమైతే నీలం రంగు, స్వల్ప విషపూరితమైతే ఆకుపచ్చ రంగు గుర్తులుంటాయి.
- వాడిన డబ్బాలు, సీసాలను ధ్వంసం చేసి గోతిలో పూడ్చిపెట్టాలి.
- పురుగు మందుల వాడకానికి వినియోగించిన పాత్రలను ఇతర అవసరాలకు ఉపయోగించొద్దు.

అధికారుల సూచనలు పాటించాలి..



వానాకాలం పంటల సాగుకు వినియోగించే విత్తనాలు, ఎరువులపై రైతులు అవగాహన కలిగి ఉండాలి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోళ్లలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యవసాయశాఖ అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి.

– లావణ్య, మండల వ్యవసాయశాఖ అధికారి, మల్లాపూర్

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలి


అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న వెంకట్‌రెడ్డి

జగిత్యాలటౌన్: అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పెర వెంకట్‌రెడ్డి అన్నారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం తహసీల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్నారు. దీనిలో భాగంగా వెంకట్‌రెడ్డి అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ అందించిన అమూల్యమైన సేవలు, వారి ఆలోచనలు, ఆశయాలను కొనసాగించడమే ఆయనకు మనమిచ్చే అసలైన నివాళి అన్నారు. కార్యక్రమంలో డిక్కీ జిల్లా అధ్యక్షుడు నల్ల శ్యాం, మద్దెల నారాయణ, బొల్లం రమేశ్, నర్ర రాజేందర్, చిత్తారి ప్రభాకర్, దాసండ్ల కమలాకర్, జవ్వాజి శంకర్ పాల్గొన్నారు.

త్యాగధనుల చరిత్రను ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలి


బహుమతులు ప్రదానం చేస్తున్న కమిటీ సభ్యులు

బుగ్గారం: దేశం కోసం, ధర్మం కోసం త్యాగాలు చేసిన వారి చరిత్రను ప్రతీ భారతీయుడు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అహల్యాబాయి జయంతి ఉత్సవాల కమిటీ జిల్లా కన్వీనర్ మర్రిపెల్లి సత్యం అన్నారు.అహల్యాబాయి జయంతి ఉత్సవాలలో భాగంగా ఆదివారం బుగ్గారంలోని శ్రీగ్లోబల్ స్కూల్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భారతదేశ చరిత్రను గల పాలకులు వక్రీకరించారని, ఎంతోమంది వీరులు ఈ గడ్డపై జన్మించారన్నారు. వారి త్యాగాలను, గొప్పతనాన్ని విస్మరించి భారతదేశంపై దండెత్తిన మొఘలుల చరిత్రను మనపై రుద్దారన్నారు. కార్యక్రమంలో శ్రీ గ్లోబల్ స్కూల్ కరస్పాండెంట్ నక్క రాజు,నాయకులు సుంకం ప్రశాంత్, కప్పల అనిల్,అక్కల రమణ,విలాసాగరపు పోశరాజు,కూతురు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గొర్ల కాపరులు మరణిస్తే ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి


నినాదాలు చేస్తున్న యాదవ సంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం: గొర్ల కాపరులు ప్రమాదవశాత్తు మరణిస్తే ప్రభుత్వం రూ. 5 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని యాదవ సంఘం అడ్‌హక్ కమిటీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గణవేని మల్లేశ్ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని గోధూర్‌లో యాదవ సంఘ భవనంలో సంఘ సభ్యులతో సభ్యత్వ నమోదు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్స్‌గ్రేషియా ప్రకటించి బాధిత కుంటుబాన్ని ఆదుకునే వరకు యాదవులందరం కలిసికట్టుగా పోరాటం చేద్దామన్నారు. యాదవుల హక్కుల సాధన కోసం పోరాటాలు చేద్దామన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘ సభ్యులు బర్మ రమేశ్, చల్ల మహేశ్, శ్రీనివాస్, దేవదాస్, వెంకటస్వామి, మల్లేశ్, లక్ష్మీ నారాయణ, శంకర్, రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో సాగునీటి కాల్వలను శుభ్రం చేయాలి

సారంగాపూర్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో సాగునీటి ప్రధాన కాలువలతో పాటు, ఉప కాల్వలను శుభ్రం చేసే పనులను చేపట్టాలని కొల్వాయి సింగిల్‌విండో చైర్మన్ పొల్సాని నవీన్ రావు అన్నారు. ఆదివారం బీర్‌పూర్‌లో మాట్లాడారు. ప్రస్తుతం ఖరీఫ్ పంటల సమయం ప్రారంభమైందని, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద, రోళ్లవాగు ప్రాజెక్టు కింద ప్రధాన కాలువలతో పాటు, ఫీడర్ చానళ్లు, ఫీల్డ్ చానళ్లను ఉపాధి కార్యక్రమం కింద చేపట్టి, వాటిలోని పూడిక, చెట్లను, పొదలను తొలగిస్తేనే చివరి భూములకు సాగునీరు చేరుతుందని తెలిపారు. ఈ విషయంపై ఇప్పటికే మాజీ మంత్రి జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని పేర్కొన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ రంగు లక్ష్మణ్, బదినేపల్లి శంకర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ప్రపంచ తల్లిదండ్రుల దినోత్సవం


అమ్మనాన్నకు పాదాభివందనం చేస్తున్న కుమారులు

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలో సామాజిక సేవకుడు సూరజ్ శివశంకర్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా ప్రపంచ తల్లితండ్రుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని పురాణీపేటకు చెందిన పేపర్ ఎజంట్‌గా పనిచేస్తున్న జూపాక గంగరాం– జయ దంపతులకు వారి కుమారులు రాజశేఖర్, సూర్యతేజ పాదాభివందనం చేసి, శాలువాతో సన్మానించి, వారి చేత కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకుడు సూరజ్ శివ శంకర్ మాట్లాడుతూ తల్లితండ్రులు తమ జీవితాలను ఫణంగా పెట్టి పెంచుతారని, అలాంటి తల్లితండ్రులను ఇటీవల కాలంలో అనాథ ఆశ్రమాల్లో ఉంచుతున్నారని, వారికి కనువిప్పు కలిగేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సేవకులు అజయ్, నవ్య, చైత్ర, శ్రీ ధనుశ్రీ, శ్రీ వైభవ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమావేశమైన పూర్వ విద్యార్థులు, టీచర్లు

రాయికల్: పట్టణంలోని ప్రగతి విద్యాలయంలో 2001–02లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా కలిసి ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా బోధన నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బాలే జయశ్రీ శేఖర్ ఉపాధ్యాయులు,పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కాపు సంఘం వన భోజనాలు


వనభోజన కార్యక్రమంలో పాల్గొన్న మున్నూరు కాపు కులస్తులు

మెట్‌పల్లి: పట్టణంలోని గోల్ హనుమాన్ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ పండుగ వన భోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కులస్తులంతా కుటుంబ సభ్యులతో కలిసి పోచమ్మ ఆలయానికి తరలి వెళ్లారు. అక్కడ బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక భోజనాలు చేశారు. ఆట–పాటలతో సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు.

పెద్దమ్మ తల్లికి బోనం



ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి గ్రామంలో ఆదివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య నెత్తిన బోనాలు, పోతురాజుల విన్యాసాలతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో చల్లగా ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు.

నల్ల పోచమ్మ బోనాలు



కథలాపూర్: మండలంలోని అంబారిపేటలో ఆదివారం నల్ల పోచమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. మహిళలు ప్రత్యేక వంటకాలతో బోనాలు తయారు చేశారు. బోనాలను గ్రామం నుంచి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకువెళ్లి, దేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



సాక్షి స్పందన

బుగ్గారం: మండలంలోని చిన్నాపూర్ 4 వ వార్డులో బోరు చెడిపోయి మరమ్మతులు చేయించక నిరుపయోగంగా ఉంది. దీనిపై ఆదివారం సాక్షిలో వాట్సాప్ కథనం ప్రచురితమైంది. దీనిపై తక్షణమే స్పందించిన స్థానిక అధికారులు బోరుకు మరమ్మతులు నిర్వహించడమే కాకుండా నూతనంగా మోటారును బిగించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో సమీపంలోని ఇండ్ల ప్రజలకు నీటి తిప్పలు తీరాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా సాక్షి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

మాల సంఘం పట్టణ అధ్యక్షుడిగా చెంగలి

రాయికల్: మాల సంఘం పట్టణ అధ్యక్షుడిగా చెంగలి గంగాధర్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఈ సందర్భంగా గంగాధర్ మట్లాడుతూ పట్టణంలోని మాల సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుర్రె శ్రీనివాస్, గుర్రంరత్నాకర్, బైరిరాజేందర్, నారాయణ, గంగారాజం తదితరులు పాల్గొన్నారు.

రేచపల్లి మడేలేశ్వర రజక సంఘ కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన నూతన కార్యవర్గం

సారంగాపూర్: మండలంలోని రేచపల్లిలో మడేలేశ్వర రజక సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కలకోట గంగయ్య, ప్రధాన కార్యదర్శిగా సంద సత్తయ్య, కోశాధికారిగా కందుకూరి తిరుపతి, సభ్యుడిగా సంద తిరుపతి నియమితులయ్యారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తామని ఎన్నికైన కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.

మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా గజ్జి నరేశ్


నరేశ్ పటేల్

మల్లాపూర్: మండలంలోని పాతదాంరాజుపల్లి మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా గజ్జి నరేశ్ పటేల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం సభ్యులు ప్రకటించారు. పాతదాంరాజుపల్లిలో ఆదివారం సంఘం సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా గాజుల నడ్పి రాజరెడ్డి. గ్రామాభివృద్ధి కమిటీ(వీడీసీ)సభ్యుడిగా గాజుల రాజిరెడ్డిను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన నరేశ్ పటేల్ మాట్లాడుతూ కుల సభ్యులందరి సహకారంతో సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో మున్నూరుకాపు సంఘం సభ్యులు గజ్జి రాజరెడ్డి, కంటే హన్మాండ్లు, బండారి రాజరెడ్డి, మాదరి సాయిబాబా, సుతారి రాజేందర్, గజ్జి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గుడేటి రెడ్డి రైతు సంఘం అధ్యక్షుడిగా రమేశ్ రెడ్డి

రాయికల్: మండలంలోని భూపతిపూర్ గ్రామ గుడేటి రైతు సంఘం కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సోమ రమేశ్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా తీగల రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా క్యాతం రాజిరెడ్డి, కోశాధికారిగా సోమ తిరుపతిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

3 నుంచి 13 వరకు భూ భారతి గ్రామసభలు

మల్లాపూర్: ఈ నెల 3 నుంచి 13 వ తేదీ వరకు మండలంలో భూభారతి రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రమేష్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు బృందాలతో గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. 3న వాల్గొండ, వీవీరావుపేట, 4న కొత్తదాంరాజుపల్లి, గొర్రెపల్లి, 5న సంగెం–శ్రీరాంపూర్, రేగుంట, 6న ఒబులాపూర్, సాతారం, 9న మొగిలిపేట, చిట్టాపూర్, 10న రాఘవపేట, ముత్యంపేట, 11న నడికుడ, సిరిపూర్, 12న మల్లాపూర్(రాందాస్‌పేట), కుస్తాపూర్, 13న గుండంపల్లి(అడవి మాదాపూర్), రత్నాపూర్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. ఈ సభలలో భూ సమస్యలపై దరఖాస్తులు తీసుకుంటారని తెలిపారు. ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

3 నుంచి భూభారతి గ్రామసభలు

కథలాపూర్: ఈనెల 3 నుంచి గ్రామాల్లో భూభారతి చట్టంపై గ్రామసభలు నిర్వహిస్తామని తహసీల్దార్ వినోద్ తెలిపారు. గ్రామాలవారీగా తేదీల వివరాలు ఇలా... 3న పెగ్గెర్ల, ఊట్‌పెల్లి, 4న దుంపేట, పోసానిపేట, 5న దూలూర్, బొమ్మెన. 6న పోతారం, ఇప్పపెల్లి, 9, 10 తేదీల్లో తాండ్ర్యాల, గంభీర్‌పూర్, 11న తుర్తి, కలిగోట. 12, 13 తేదీల్లో సిరికొండ, అంబారిపేట,16, 17 తేదీల్లో కథలాపూర్, తక్కళ్లపెల్లి, 18, 19 తేదీల్లో భూషణరావుపేట, చింతకుంట గ్రామాల్లో గ్రామసభలుంటాయన్నారు. భూమి సమస్యలుంటే రైతులు గ్రామసభల్లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందజేత

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో క్రికెట్ క్రీడాకారులకు స్థానికుడైన పీడీ గుండెల రాజేశ్ క్రీడా దుస్తులను ఆదివారం అందించారు. గ్రామంలోని 20 మంది క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందించినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాలని క్రీడా దుస్తులను అందించినట్లు రాజేశ్ పేర్కొన్నారు.

శివాజీ విగ్రహ ఆవిష్కరణ

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం మేడిపల్లిలో తెలంగాణ ప్రాంత సామాజిక సమరసత సంయోజకులు అప్పాల ప్రసాద్,విశోక తీర్థ స్వామి ఆధ్వర్యంలో ఆదివారం శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసు

మెట్‌పల్లి: పేకాట ఆడుతూ పట్టుబడ్డ ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. మెట్‌పల్లి పట్టణ శివారులోని ఆరపేట సమీపంలో పేకాట ఆడుతుండగా పట్టుబడ్డారని, రూ.13,750 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.